క్లుప్తంగా

నేటి నుంచి స్టీల్‌ప్లాంట్‌లో బాణసంచా విక్రయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో బాణసంచా విక్రయాలు గురువారం ప్రారంభమవుతున్నాయని కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి. నాగబాబు, ఆకుల నూకరాజు తెలిపారు. స్టోర్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితితో పాటు ఉద్యోగుల ఇబ్బందులను అయ్యాన్ సంస్థకు వివరించడంతో గతేడాది కంటే తక్కువ ధరలకు బాణ సంచా సరఫరా చేశారన్నారు. ఈనెల 31 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అమ్మకాలు సాగుతాయన్నారు. సెక్టార్-5 అంబేడ్కర్ కళాక్షేత్రంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం 7 కౌంటర్లు, ఇతరులకు 2 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జి. నాగభూషణం, డైరక్టర్లు బి.టి. జగదీష్, ఎ.వి. జగదీశ్వరరావు, ఎ.వి. సత్యనారాయణ, ఈ.లోకేష్, ఎస్. భాను, కె. శ్రీనివాస్, పి.ఆర్.కె.రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



శరణ్య, ఢిల్లీశ్వరి, నాగచైతన్యలతో హెచ్ఎం కాంతం, పీడీ ఇస్మాయిల్

అక్కిరెడ్డిపాలెం: వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో గుంటూరు జిల్లా కారంచేడులో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులైన కె.శరణ్య, సీహెచ్.నాగచైతన్య, ఆర్.ఢిల్లీశ్వరివిశాఖపట్నం జిల్లా జట్టు నుంచి పాల్గొంటారని పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో వీరు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. బుధవారం వీరిని పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్. ఎస్.కాంతం ప్రత్యేకంగా అభినందించారు.

స్తంభంపై నుంచి జారిపడి లైన్‌మన్‌కు గాయాలు

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్ వద్ద విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడిన ఓ లైన్‌మన్‌కు గాయాలయ్యాయి. వివరాలివి. బాతుల అప్పల ప్రసాద్ నాయుడు ఏపీఈపీడీసీఎల్ పెదగంట్యాడ రూరల్ కేంద్రంలో పని చేస్తున్నాడు. దయాల్‌నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతులు నిర్వహించేందుకు స్తంభం ఎక్కుతుండగా అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతనికి గాయాలు కావడంతో వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతన్ని పరీక్షించి ఎడమ చేయి ఎముకల్లో ఎయిర్స్ క్రాక్స్ వచ్చినట్టు గుర్తించారు. చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

1 నుంచి స్వాములకు అన్నదానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నవంబర్ 1 నుంచి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిసెంబర్ 11 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు నిర్వహించనున్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు మాత్రమే అన్నదానం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

27న ఏబీవీపీ యూనివర్సిటీ సమ్మేళనం

ఎంవీపీకాలనీ: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ యూనివర్సిటీ సమ్మేళనం పోస్టర్‌ను బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఏబీవీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ వేదికగా యూనివర్సిటీ విద్యార్థుల సమ్మేళనం జరగనుందని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి యూనివర్సిటీల విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఏబీవీపీ ఏయూ అధ్యక్షుడు డి.నరసింహ పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- గోతుల మయంగా షీలానగర్ రోడ్డు
- దెబ్బతింటున్న వాహనాలు
- ఒళ్లు హూనం అవుతోందని వాహనదారుల గగ్గోలు



హరిజన జగ్గయ్యపాలెం నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డు దుస్థితి



వెంకటేశ్వరకాలనీ నుంచి షీలానగర్ రోడ్డులో ప్రమాదకరంగా గోతులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ నగరంలో ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన షీలానగర్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారి భారీ గోతులు తేలి ప్రమాదాలకు నిలయంగా మారింది. విలాసవంతమైన భవనాలు, ఖరీదైన ప్రాంతంగా పేరొందిన షీలానగర్‌లో నివాసితులు అధ్వాన రహదారితో అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, షీలానగర్ నుంచి గవరజగ్గయ్యపాలెం వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది.

నిత్యం అవస్థలు

హరిజనజగ్గయ్యపాలెం నుంచి షీలానగర్ వెళ్లే మార్గంలో మలుపు వద్ద, చర్చి ఎదురుగా, వెంకటేశ్వరకాలనీ నుంచి షీలానగర్ ప్రధాన రహదారి మలుపు వద్ద, షీలానగర్ ప్రధాన రోడ్డుపై ప్రతీ 20 అడుగులకో గుంతతో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. షీలానగర్ వంటి ప్రాంతానికి సుమారు 100 అడుగుల రోడ్డు ఉండాలని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. ఈ రోడ్డు మీదుగా వికాస్, బెహరా, విశాఖ ఇంజినీరింగ్, డిప్లమో కళాశాలలకు చెందిన బస్సులు పదుల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం ఈ రోడ్డు మొత్తం బస్సులతో రద్దీగా ఉంటుంది. రహదారి గోతులమయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. వాహనాలు దెబ్బతినడంతో పాటు ఒళ్లు హూనం అవుతుందని రాకపోకలు వాహనదారులు వాపోతున్నారు. మరో వైపు ఇరుకు రోడ్డులో మంగళవారం సంతతో మరింత అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. సంత నిర్వహించేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి అందులోకి తరలించి ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టాలని షీలానగర్ వాసులు కోరుతున్నారు.



షీలానగర్ చర్చి ఎదురుగా అధ్వానంగా రోడ్డు

రోడ్డు పూర్తిగా ధ్వంసం



అందమైన షీలానగర్ రోడ్డు కళావిహీనంగా మారింది. ఈ ప్రాంతం ఖరీదైందనే మాటేగానీ ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా రోడ్డు అభివృద్ధి చేయాలని ఆలోచించడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలి.

–మళ్ల నగేశ్ కుమార్, షీలానగర్

ప్రమాదాలకు ఆస్కారం



జాతీయ రహదారి నుంచి షీలానగర్ వరకు రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారింది.ఇటీవల కురిసిన వర్షాలకు చిన్న చిన్న గోతులు సైతం వాహనాల రాకపోకలతో పెద్దవయ్యాయి. ప్రమాదకరంగా మారాయి. వాహనాలు తప్పించే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు ఒక్కసారి రోడ్డు పరిశీలించాలి.

–రాకోటి గోపి, షీలానగర్

మెదడులో ఉబ్బిన రక్తనాళానికి అరుదైన చికిత్స



డాక్టర్ వెంకటేష్‌తో చికిత్స పొందిన మహిళ

అక్కిరెడ్డిపాలెం: మెదడులో రక్తనాళాలు ఎన్యురిజం (ఉబ్బడం) అనేది చాలా తీవ్రమైన సమస్య. దీనివల్ల భరించలేని తలనొప్పితో పాటు బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కూడా వస్తాయి. ఇలాంటి సమస్యలతో బాధపడుతున్న 64 ఏళ్ల మహిళలకు విశాఖపట్నం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అత్యాధునిక పద్ధతిలో చికిత్స నిర్వహించి ఊరట కల్పించారు. ట్రెన్జా అనే పరికరాన్ని ఇందుకోసం వినియోగించినట్టు ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ అండ్ న్యూరో అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్‌పోతుల తెలిపారు. విజయనగరానికి చెందిన 64 ఏళ్ల మహిళ తీవ్రమైన తలనొప్పి, కుడివైపు చేతులు, కాళ్లు తిమ్మిరెక్కడం లాంటి సమస్యలతో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు ఎంఆర్ఐ, డీఎస్ఏ (డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రఫీ) పరీక్షలు నిర్వహించారు. దీని ద్వారా మహిళ మెదడులో రక్తనాళాలు ఉబ్బినట్లు తేలిందన్నారు. అత్యాధునికమైన ట్రెన్జా అనే పరికరంతో చికిత్స చేసినట్టు చెప్పారు. ఈ పరికరాన్ని ఉపయోగించడం రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారి అన్నారు. చికిత్స చేసిన మూడో రోజు మహిళను డిశ్చార్జ్ చేశామని డాక్టర్ వెంకటేష్ తెలిపారు.

హమ్మయ్య .. గుంతలు పూడ్చారు



గుంతలు పూడ్చిన తర్వాత వుడా డబుల్ రోడ్డు



మరమ్మతులు చేస్తున్న వుడా డబుల్ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: మండలంలోని వుడా కాలనీ నుంచి గాజువాక వెళ్లే వుడా డబుల్ రోడ్డులో గుంతలను పూడ్చారు. రోడ్డు మరమ్మతులు చేయించారు. కొత్తగా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఈ రోడ్డు మొత్తం గోతులమయం కావడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో 'రోడ్డు ఇలా.. ప్రయాణమెలా' అనే శీర్షికన సాక్షిలో ఈ నెల 20న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. సమతానగర్ సాయిబాబా మందిరం నుంచి వంటిల్లు జంక్షన్ వరకూ గల రోడ్డులోని గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోటలో ఉంటున్న ఓ వివాహిత మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంక మల్లిక (38) ముగ్గురు పిల్లలతో కలసి తల్లి లంక లత వద్ద భానోజీతోటలో నివాసం ఉంటోంది. 2005లో ఎండీ రజాక్ అనే వ్యక్తితో ఆమెకు వివాహమైంది. 2010లో మల్లిక భర్తతో విడిపోయి ముగ్గురు పిల్లలతో కలసి తల్లి వద్దకు వచ్చేసింది. తర్వాత ఆమె ఓ ప్రైవేటు సంస్థలో పని చేసేది. మూడేళ్ల కిందట ఆ ఉద్యోగం మానేసింది. తర్వాత ఆమె విశాఖనగరంలోని పాత పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన గణేష్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం లతకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పోము (తావీదు) కట్టించుకునేందుకు తల్లి లత, కమార్తె రిజ్వానతో కలసి జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పెదపాలెం వెళ్లింది. సాయంత్రం వారు ఆటోలో తిరిగి వస్తుండగా జగ్గు జంక్షన్ వద్ద ఆటో దిగిపోమని గణేష్ నుంచి మల్లిక ఫోన్‌కు మెసేజ్ రావడంతో అక్కడ దిగిపోయింది. తర్వాత ఆమె రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఇంతలో ఏమైందో ఏమో కానీ ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే మృతురాలి తల్లి లత గమనించి న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి లత ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ దుకాణాలకు సబ్సిడీ ఉల్లి, టమాటా!

రైతు బజార్ సిబ్బంది పర్యవేక్షణ కరవు



టమాటా కౌంటర్



రైతు బజార్‌లో ఉల్లిపాయల కౌంటర్ వద్ద రద్దీ

గాజువాక: గాజువాక మహిళా రైతు బజార్ నుంచి సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలు ప్రైవేట్ దుకాణాలకు తరలిపోతున్నాయి. ప్రజలకు అందాల్సిన ఈ రెండు వస్తువులు ప్రైవేట్ వ్యాపారుల గుప్పెట్లోకి పోతున్నాయి. దీన్ని అడ్డుకోవాల్సిన సిబ్బంది పని భారం పేరుతో పర్యవేక్షణకు దూరంగా ఉంటున్నారు. ఫలితంగా రైతు బజార్‌కు వస్తున్న కొనుగోలుదారులు తగినన్ని ఉల్లిపాయలు, టమాటాలు లభించక దొరికిన వాటితో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ధరలు పెరగడంతోనే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలనంటిన విషయం తెలిసిందే. రైతు బజార్‌లో కిలో టమాటా రూ.48కి, కిలో ఉల్లిపాయలు రూ.54కు విక్రయిస్తుండగా, ప్రైవేట్ మార్కెట్‌లో వాటిని కిలో రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో టమాటా, ఉల్లిపాయల కోసం రైతు బజార్‌కు జనం క్యూ కడుతున్నారు. దీన్నే అదనుగా భావించిన ప్రైవేట్ కూరగాయల వ్యాపారులు రైతు బజార్‌లోని ఉల్లి, టమాటా వ్యాపారులతో కుమ్మక్కై వాటిని కొనుగోలు చేసేస్తున్నారు. రైతు బజార్‌లో నిర్ణయించిన ధరకంటే ఎక్కువ వస్తుండడంతో ఆ వ్యాపారులు కూడా ప్రైవేట్ వ్యాపారులకే అమ్మేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలతో పాటు కూరగాయలను బల్క్‌గా తరలించడంతో రైతు బజార్ స్టాళ్లలో ఆశించిన మేర కూరగాయలు లభించడంలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకొంటున్నాం

ప్రైవేట్ వ్యాపారులకు సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలు విక్రయించకుండా సాధ్యమైనంత వరకు అడ్డుకొంటున్నాం. మాకు పర్యవేక్షణతోపాటు అడ్మినిస్ట్రేటివ్ పనులు కూడా చాలా ఉంటున్నాయి. దీంతో కార్యాలయంలో కూర్చొని ఆ పనులు చేస్తున్న సమయంలో ప్రైవేట్ వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఎవరైనా పెద్ద బ్యాగులతో ఉల్లి, టమాటాలు తీసుకెళ్తే తనిఖీ చేస్తున్నాం. ఉదయం 10 గంటల వరకు ఏ సరుకైనా స్టాళ్ల ద్వారా ప్రజలకే నేరుగా అమ్మాలని ఆదేశాలు కూడా ఇచ్చాం. దీనిపై మరింత పర్యవేక్షణ పెంచుతాం.

–హరిత,ఈవో, గాజువాక మహిళా రైతు బజార్

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే పల్లాకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

గాజువాక: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ సీజనల్ మలేరియా కార్మికులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. 2019లో తమ పేరుతో ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలు తెరిచారని వివరించారు. జీతం నుంచి నగదు మినహాయించి ఆయా సంస్థలకు జమ చేశారని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించలేదన్నారు. సంవత్సరానికి మూడు నెలలపాటు పని లేకుండా ఖాళీగా ఉంచుతున్నారని దీనివల్ల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వివరించారు. ప్రభుత్వం స్పందించి పర్మినెంట్ వర్కర్లగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు గొలగాని అప్పారావు తదితరులు ఉన్నారు.

విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించారు. అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

భళా మాస్టారు

- వృత్తితో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ ముందంజ
- ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మూర్తికి అవార్డుల పంట



పెదగంట్యాడ: ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు డీఎస్ మూర్తిని అవార్డులు వరించాయి. విద్యా బోధనలో శ్రద్ధాశక్తులతో పాటు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తనదైన ముద్ర వేస్తున్నారు. సులభంగా బోధన చేస్తూ విద్యార్థులు సులువుగా ఇంగ్లిష్‌ను అర్థం చేసుకోవడంతో పాటు సరళంగా మాట్లాడేలా తర్ఫీదునిస్తున్నారు.. పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచేందుకు తనవంతు పాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి.. వారిని ప్రోత్సహిస్తున్నారు. విద్యా బోధనలో తనకు తానే సాటి అని నిరూపించుకోవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేసుకుంటున్నారు.

సేవలకు గుర్తింపు

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలోనూ ముందుంటున్నారు డోల నర్సింహమూర్తి (డి.ఎస్.మూర్తి). అతని సేవలను గుర్తించి హైపెడ్జ్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సంస్థ ఈ నెల 18న న్యూఢిల్లీలో నేషనల్ బ్రిలియంట్ ఎడ్యుకేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఇన్నోవేటివ్ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందజేసింది. ఈ అవార్డును కేంద్ర మాజీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్‌జీ, సంస్థ చైర్మన్ గౌతమ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ అవార్డుకు ఆంధ్రప్రదేశ్ నుంచి మూర్తి ఎంపిక కావడం గమనార్హం.

గురు బ్రహ్మ అవార్డు

ఈ నెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజమండ్రి టాలెంట్ టెస్ట్ గ్రూపు వారు డీఎస్ మూర్తికి గురుబ్రహ్మ అవార్డు అందజేసి సత్కరించారు. అలాగే సెప్టెంబర్ 5న గుంటూరులో నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. ఇటీవల రోటరీ క్లబ్ వారు నేషనల్ బిల్డర్ అవార్డు అందజేశారు.



కేంద్ర మాజీ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఎస్ మూర్తి (ఫైల్)

ఇవీ మూర్తి సేవలు..

డీఎస్ మూర్తి వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు.. అయితే సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ యువతను ప్రోత్సహిస్తున్నారు. ఎక్కడ రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినా అక్కడకు వెళ్లి రక్తం దానం చేయడం అలవాటు చేసుకున్నారు. అంతేకాకుండా ఆయనే స్వయంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్తం సేకరించి ఎంతోమంది ప్రాణాలను నిలపడంలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. సాఫ్ట్ స్కిల్స్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ఉంటూ విద్యార్థులకు తనదైన శైలిలో శిక్షణ ఇస్తున్నారు. రేడియోలో పలు కార్యక్రమాలు నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కళా రంగంలో విద్యార్థులు రాణించేలా.. వారిలో ఆసక్తి కలిగేలా పలు అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. స్టేట్ బయాలజీ గ్రూపుతో పాటు జిల్లా సైన్స్ ఆర్గనైజేషన్‌లో ఉంటూ తనదైన ముద్ర వేస్తున్నారు. విద్యార్థులు ఇన్‌స్పైర్ అయ్యేలా వారితో ప్రాజెక్టులు తయారు చేయించి ప్రోత్సహిస్తున్నారు ఈ ఉత్తమ ఉపాధ్యాయుడు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు మంజూరు చేయండి



ఏఎంహెచ్‌వోను కలిసిన కరణంరెడ్డి తదితరులు

గాజువాక: పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఆయన జీవీఎంసీ సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌ను బుధవారం కలిసి ఈ విషయంపై చర్చించారు. ఈ పథకాన్ని జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లోని అర్హులందరికీ అందజేయాలని కోరారు. బీజేపీ తరఫున తాము ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్యాధికారిని కలిసిన వారిలో నాయకులు రాజశేఖర్, మనోహర్ ఉన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారిణులతో ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: క్రీడలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడతాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఏయూ జిమ్నాజియంలో బుధవారం నిర్వహించిన మహిళల అంతర కళాశాలలు, యూనివర్సిటీల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంపిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వర్సిటీ నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు టీఏ, డీఏలు కూడా అందిస్తామని చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకం ఉంటుందన్నారు. అనంతరం ఏయూ గుర్తింపు కళాశాలల నుంచి వచ్చిన కబడ్డీ జట్లను పరిచయం చేసుకున్నారు. పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఏయూ గుర్తింపు పొందిన కళాశాలల నుంచి 250 మందికి పైగా కబడ్డీ పోటీల ఎంపికలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో రాణించిన వారు యూనివర్సిటీ జట్టుకు ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజ్, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, ఐఐపీఈ క్రీడాధికారి డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, గొన్నా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఉద్యోగులకు దీపావళి బోనస్

అక్కిరెడ్డిపాలెం: న్యూఢిల్లీలో భెల్ కార్పొరేట్ యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాల నేతల సమక్షంలో దీపావళి బోనస్‌పై చర్చలు జరిగాయని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకుడు ఎస్.జగన్నాథరావు బుధవారం తెలిపారు. చర్చల్లో భెల్ జేఎస్‌సీ చైర్మన్, ఇంటక్ ఆల్ ఇండియా అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, జేఎస్‌సీ సభ్యులు, సీఐటీయూ ఆల్ ఇండియా ప్రధానకార్యదర్శి తపన్ సేన్, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారని చెప్పారు. ప్రతీ ఉద్యోగికి దీపావళి బోనస్‌గా రూ.25 వేల చొప్పున ఈ నెల బ్యాంకు ఖాతాల్లో జమచేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.సీతం నాయుడు, కె.విజయ్‌కుమార్. వి.బాబూరావు, కె.నారపురెడ్డి, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా దీపావళి



ఆనంద దీపావళి పోస్టర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాజువాక: దీపావళి పండగను కాలుష్య రహితంగా, నిశ్శబ్దంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో నిశ్శబ్ద, కాలుష్య రహిత దీపావళి పేరుతో ఆనంద దీపావళిని జరుపుకుందామంటూ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీకే పరశురామ్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు గంగేశ్వరరావు, పి.భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.